క్లుప్తంగా

ఈవోపీఆర్డీగా రేణుక



రేణుకకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో తదితరులు

సారవకోట: మండల పరిషత్ ఈవోపీఆర్డీగా రేణుక శుక్రవారం విధులలో చేరారు. ఆమదాలవలస నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ కొన్ని సంవత్సరాలుగా ఈవోపీఆర్డీ పోస్టు ఖాళీగా ఉండటంతో పాతపట్నం ఈవోపీఆర్డీ ప్రసాద్ పండా ఇన్‌చార్జిగా వ్యవహరించేవారు. విధులలో చేరిన రేణుకకు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఏవో ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

అంబావల్లిలో వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సాయిగీత అన్నారు. అంబావల్లి గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

90 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆమదాలవలస రూరల్: వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు హరిణి, చైతన్య సూచించారు. వెదుళ్లవలస గ్రామంలో సర్పంచ్ చిలకపల్లి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వేసవికాలంలో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



దీక్షలో ఉద్యోగులు

హిరమండలం: ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏపీజీఈఏ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


శ్రీముఖలింగంలో పండిత సదశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అంకురార్పణ, హోమం, పండిత సదశ్యం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు చేశారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు.

సారవకోట తహసీల్దార్‌గా హనుమంతురావు

సారవకోట: సారవకోట తహసీల్దార్‌గా హనుమంతురావు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేస్తున్న ప్రవల్లికా ప్రియ టెక్కలికి బదిలీపై వెళ్తుండగా.. కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న హనుమంతరావును సారవకోట తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు నియమించారు.

పాతపట్నం ఎస్సైగా ప్రభాకరరావు



ప్రభాకరరావు

పాతపట్నం: పాతపట్నం పోలీస్ స్టేషన్ ఎస్సైగా జి.ప్రభాకరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం విద్యుత్‌శాఖ విజిలెన్స్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్.కామేశ్వరరావు గార పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ.. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

సంక్షేమానికి పెద్దపీట

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- లైదాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాలను తెలియజేస్తున్న స్పీకర్ సీతారాం

పొందూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నట్టు చెప్పారు. లైదాం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ స్పీకర్ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు చేకూరిన లబ్ధిని తెలియజేశారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమాన్ని చేరువ చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల వర్తింపు కోసం ఎవరికి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, నాయకులు జమ్మినాయుడు, వండాన వెంకటరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు ఖరారు



మాట్లాడుతున్న సూర్యనారాయణ

కొత్తూరు: కొత్తూరు పీఏసీఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన 20 దుకాణాలకు అద్దెలను సంఘం కార్యదర్శి కృష్ణారావు ఖరారు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సంఘ సమావేశం జరిగింది. ముందుగా ప్రస్తుతం షాపుల్లో అద్దెకు ఉన్న వ్యాపారులతో సమావేశమై చర్చించారు. గడిచిన మూడు సంవత్సరాలుగా కరోనా కారణంగా షాపుల అద్దెలను పెంచలేదని.. అయితే జూన్ నుంచి అద్దెలు పెంచుతున్నట్లు చైర్మన్ వ్యాపారులతో చెప్పారు. సంప్రదింపుల అనంతరం షాపింగ్ కాంప్లెక్స్ కింద భాగాన ఉన్న పది షాపులకు ఇంతవరకు నెలకు రూ. 12 వేలు అద్దె ఉండగా 11.5 శాతం పెంచి రూ. 13,500, పైన ఉన్న పది షాపులకు ఇంత వరకు నెలకు రూ. మూడు వేలు చెల్లిస్తుండగా 13.5 శాతం పెంచి రూ. నాలుగు వేలుగా అద్దెను ఖరారు చేశారు. పెంచిన అద్దె ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తోందని వెల్లడించారు. సమావేశంలో సూపర్‌వైజర్ ధర్మారావు, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

ఎరువుల విక్రయానికి చర్యలు

అనంతరం చైర్మన్ చింతాడ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పీఏసీఎస్ ద్వారా డీఏపీ, యూరియా ఎరువులు రైతులకు విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రెండు రోజుల్లో ఎరువులు వస్తాయని చెప్పారు. అలాగే రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించి ప్రభుత్వం చెల్లిస్తున్న వడ్డీ రాయితీలు పొందాలన్నారు.

సమస్యలు రాకుండా క్వారీ నిర్వహించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: గ్రానైట్ క్వారీ నిర్వహణ వల్ల గ్రామస్తులకు, భూములకు, తాగునీటికి ఎటువంటి సమస్యలు రాకూడదని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిఅన్నారు. మెళియాపుట్టి మండలం దబ్బుగూడలో సర్వే నంబర్-13లో 10 హెక్టార్ల కలర్ గ్రానైట్ నిర్వహణకు సీహెచ్ శ్రీనివాసకుమార్ ప్రైవేట్ సంస్థకు సంబంధించి శుక్రవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ క్వారీనుంచి ప్రభుత్వానికి చెల్లించేదానిలో 75 శాతం చుట్టుపక్కల గ్రామాలకు ఖర్చుచేసి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందే ప్రజల అవసరాలను తీర్చడానికి ముందుకురావాలన్నారు. యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ రాళ్లను కోసే సమయంలో ఎటువంటి హానికర ద్రావణాలు వాడబోమని, బాంబు పేలుళ్లు చేయడం జరగదని, పరిమితికి మించి బరువులను తరలించబోమని చెప్పారు. అనుమతులు ఒకలా తీసుకుని, పనులు వేరేలా చేసి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే పనులు నిలిపివేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు మైనింగ్ శాఖ అధికారులు, తహశిల్దార్ సరోజిని, ఏఓ తిరుపతి పట్నాయక్, ఆర్ఐ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



అప్పలనాయుడు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పాతపట్నం: సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు సాధ్యమని పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ పని చేస్తూ ఎంపీడీవోగా పదోన్నతి పొందిన కొమరాపు అప్పలనాయుడు, పద్మావతి దంపతులను మండల అధికారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. అప్పలనాయుడు అనకాపల్లి జిల్లా యలమంచిలి ఎంపీడీవోగా పదోన్నతిపై వెళుతున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ, తహసీల్దార్ రవిచంద్ర, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, విశ్రాంత ఎంపీడీవో ఎస్.చిరంజీవి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.


జగనన్న విద్యాకానుక కిట్లు పరిశీలన



విద్యాకానుక కిట్ల వివరాలు పరిశీలిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

బూర్జ: బూర్జ జెడ్పీ హైస్కూల్లో భద్రపరిచిన జగనన్న విద్యాకానుక కిట్లను డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య శుక్రవారం పరిశీలించారు. మండలంలో 62 పాఠశాలలు, ఓవీపేటల ఏపీ మోడల్ స్కూల్, కొల్లివలసలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం, కేజీవీబీ సహా మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థుల కోసం సిద్ధం చేసిన కిట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత మామిడివలస హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.రామకృష్ణ, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి



మాట్లాడుతున్న ఈఈ రాజశేఖర్

నరసన్నపేట: ప్రతిఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని ఈపీడీసీఎల్ టెక్కలి డివిజన్ ఈఈ వీపీ రాజశేఖర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఇంధన పొదుపు/సామర్థ్యంపై విద్యుత్ వినియోగదారులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు విద్యుత్ వాడకంలో మెలకువలు పాటించడంతోపాటు వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సమావేశంలో డీఈ కె.ఇంద్ర, ఏఈలు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ పొదుపుపై వినియోగదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ



కృష్ణారావు

పాతపట్నం: పాతపట్నం సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌గా సివిల్ సర్జన్ డాక్టర్ ఎస్.కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం జిల్లా గజపతినగరం ఏరియా ఆస్పత్రి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన వైద్యుడు వై.సురేంద్రబాబు ఇక్కడే ఉన్నారు. ఆస్పత్రికి సివిల్ సర్జన్ రావడంతో రోగులకు అవసరమైన ఆపరేషన్‌లు జరుగుతాయన్నారు.

మద్యం దుకాణం తరలింపు

పోలాకి: బెలమర జంక్షన్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని పిన్నింటిపేటకు అధికారులు శుక్రవారం తరలించారు. గతంలో కూడా ఇక్కడే మద్యం దుకాణం ఉండేంది.

అయితే శివాలయం, కోదండ రామాలయం ఉండడంతో ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వ్యాపార కేంద్రమైన పిన్నింటిపేట నుంచి జనావాసాలకు దూరంగా ఉన్న బెలమర జంక్షన్‌కు మార్చారు. మళ్లీ పిన్నింటిపేటకు తరలించడానికి కారణం తెలియరాలేదు.

ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను కలిసిన నూతన ఎస్సై



ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై సత్యనారాయణ

పోలాకి: పోలాకి పోలీసుస్టేషన్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను మబగాంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా, సంఘవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టేవారి నుంచి మండల ప్రజలను రక్షణ కల్పించాలని ఎస్సైకు సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేసి సంఘంలో మంచిపేరు సంపాదించాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మండలంలోని పలు సమస్యలను ఎస్సై దృష్టికి తీసుకువచ్చారు.

నేడు సరుబుజ్జిలిలో స్పీకర్ తమ్మినేని పర్యటన

సరుబుజ్జిలి: శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సరుబుజ్జిలిలో శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మండల కేంద్రంలోని తమ్మినేని శ్రీరామ్మూర్తి కళా ప్రాంగణం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని వలంటీర్లను సత్కరిస్తారు.

ఎల్.ఎన్.పేట తహసీల్దార్‌కు బదిలీ

ఎల్.ఎన్.పేట: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బి.ఎస్.ఎస్.సత్యనారాయణకు సోంపేట మండలానికి బదిలీ అయింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని డీటీ రషీద్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తనకు బాధ్యతలు అప్పగించినట్టు అహ్మద్ చెప్పారు.

సామాజిక తనిఖీ బృందాలు రాక

ఎల్.ఎన్.పేట: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించేందుకు సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలకు చేరుకున్నాయని ఏపీవో వి.శ్రీదేవి తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన సుమారు రూ.పది కోట్లు విలువైన పనులు పరిశీలించటంతో పాటు వేతనదారులకు ఉపాధి చట్టంపై అవగాహన కలిగిస్తారన్నారు. గ్రామానికి వచ్చే సామాజిక తనిఖీ సిబ్బందికి వేతనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

పొందూరు: ప్రజల నుంచి సమస్యలపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మండల ప్రత్యేక అధికారి కె.కృష్ణారావు చెప్పారు. ఇందులో భాగంగానే స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వినతుల రూపంలో వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని భౌతికంగా విచారణ జరిపి న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం దరఖాస్తులను పరిశీలించాలి

పాతపట్నం: జగనన్నకు చెబుదాం విభాగానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణకరరావు మండల అధికారులకు సూచించారు. మండలస్థాయి అధికారులతో జగనన్నకి చెబుదాంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చిన సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, వైద్యుడు శ్రీధర్, హౌసింగ్ ఏఈ భాస్కరరావు పాల్గొన్నారు.

సంచార పశువైద్య సేవలపై అవగాహన

పాతపట్నం: వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం పశువైద్య సహాయ సంచాలకులు మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలోని ఏడీ కార్యాలయంలో పశువైద్యులకు, సిబ్బందికి సంచార పశు వైద్య సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో పశువులకు వివిధ రకాల సేవలు అందించాలన్నారు. పశువులకు అనారోగ్య సమస్యలు ఉంటే 1962 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. పశువైద్యులు పి.అనిల్, కె.మౌనిక, హరిష్, మోహన్, తారకేశ్వరరావు, కుమారి, విజయ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం



ఉప్పరపేటలో మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- నేరడి పంచాయతీ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. నేరడి పంచాయతీ జోగిపాడు, ఉప్పరిపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించారు. అలాగే చేకూరిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ఉప్పటరిపేటకు చెందిన విద్యార్థినులు యమున, ప్రసన్నలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగనన్నతోనే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూరాయని చెప్పి ఆనందం వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, విద్యాదీవెన, జగనన్న విద్యాకానుకలు అందుతున్నాయన్నారు. అలాగే ఈ ప్రభుత్వ హయాంలో అన్ని పథకాలు అందుతున్నాయని కె.అచ్చెమ్మ, పాపమ్మ, అమ్మన్నలు ఎమ్మెల్యేతో అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మురుగు నీటి కాలువ సమస్య పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆమె తన వెంట ఉన్న ఈవోపీఆర్డీ కృష్ణారావును పిలిచి సమస్య పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవినీతి రహిత పాలనను ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేస్తున్నారన్నారు.

టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు మంజూరు చేసేవారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, నేరడి సర్పంచ్ నక్క చిన్నమ్ముడు, నాయకులు బూర్లె శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, మఠం పూర్ణ, లోతుగెడ్డ తిరుపతిరావు, ధర్మారావు, పంకజదాస్, నక్క వెంకటరావు, సాధుబాబు తదితరులున్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

- హౌసింగ్ డీఈ నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

హిరమండలం: ఇంటి నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని గృహనిర్మాణ శాఖ డీఈ వి.నర్సింగరావు లబ్ధిదారులకు సూచించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంతి పథం (వెలుగు) కార్యాలయలంలో జగనన్నకాలనీ ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరగా నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. మండలంలో జగనన్న లేఅవుట్లలో 409 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరవ్వగా.. ఇందులో మేజర్ పంచాయతీ హిరమండలంలోనే 247 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరంతా వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించాలన్నారు. లేఅవుట్లలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మంజూరైన ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ఏఈ కె.మాధవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మీసాల వెంకటరామకృష్ణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ డి.సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యులు టి.శంకర్‌రావు, ఎందవ ప్రసాద్, మేజర్‌పంచాయతీ ఇన్‌చార్జి ఈవో నర్సింగరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వ్యవసాయ యంత్ర పరికరాల అందజేత



యంత్ర పరికరాలు అందజేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని నాలుగు ఆర్బీకేలకు సంబంధించి రూ.90 లక్షలు విలువచేసే యంత్ర పరికరాలను రైతులకు సబ్సిడీపై అందజేసినట్టు వ్యవసాయశాఖాధికారి వి.రాజేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్ యంత్రసేవా పథకంలో భాగంగా ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లను మెగా పంపిణీ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో శుక్రవారం అందజేసినట్టు చెప్పారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కొత్తూరు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇక్కడ కొత్తూరు, హిరమండలం మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తొలిరోజున వందమంది పరీక్ష రాయాల్సి ఉండగా 29 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాదరావు చెప్పారు.

ముగిసిన ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నెల రోజులు నిర్వహించిన ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేసీహెచ్ గుప్త పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించం ద్వారా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోగలరన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పీడీ పోలినాయుడు, పీఈటీ గోపి, ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, ఫుట్‌బాల్ కోచ్ రాకేష్ పాల్గొన్నారు.

కొత్తవలసలో నేత్ర వైద్య శిబిరం రేపు

ఆమదాలవలస రూరల్: కొత్తవలస గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ మెట్ట నాగజ్యోతి, ఉప సర్పంచ్ గురుగుబెల్లి వెంకటప్పలనాయుడు శుక్రవారం తెలిపారు.

క్రీడా పరికరాల వితరణ

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ సబ్‌సెంటర్‌లోని క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు వైశ్వరాజు కేశవరాజు క్రీడా పరికరాలను వితరణ చేశారు. రూ. 4 వేల విలువైన గ్లౌజులు, ప్యాడ్స్, ఇతర పరికరాలు అందించారని కోచ్ అనిల్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు తెరిచే రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించేందుకు విద్యా శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంట్లో భాగంగా మండలంలోని 83 పాఠశాలల్లో 5,600 మంది విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీకి వీలుగా నరసన్నపేటలోని నిల్వ కేంద్రం నుంచి పాఠశాలలకు తరలించే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల్లో అన్ని స్కూళ్లకు చేరవేస్తామని ఎంఈవో శాంతారావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలో నాడు-నేడు రెండో విడత పనులు అమలు తీరుపై ఎంఈవో శాంతారావు, ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళిలు సమీక్షించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని హెచ్ఎంలకు సూచించారు.

ఆలయ భూములు రక్షించాలని వినతి

నరసన్నపేట: జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామస్వామి ఆలయ భూములను రక్షించాలని, ఆ భూముల నుంచి కౌలు ఆలయానికి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ చెట్టు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. నరసన్నపేట మండలం పోతయ్యవలసతో పాటు పలు గ్రామాల్లో 730 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్టు చెప్పారు. సాగు చేస్తున్న రైతులు కౌలు చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం ఆలయంలో అర్చకులు ధూపదీప నైవేద్యాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు గమనించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com